నుధరింపుడు. ధరించువిధం- యీ తాయత్తులు రెండున్నూ భార్యాభర్తలిరువురు ధరించి ఆదినము మొదలు చెరియొకగదిలోను దీనితో పంపబడిన మంత్రమును పఠిస్తూ నిద్రించవలెను. మరి ఎన్నటికిని సంతానభాధ కలుగనేరదు. ఉ తాయత్తులు 2-4-0 పోస్టేజీ పోస్టువారిదే.

మహాంకాళీ దివ్యమందిరం, నీలగిరికొండలు.

విలాస:-ఏమిరా నీడిహాస్యరసం ఏమిబలేగా ఉంది వీడి విట్ కి వండర్ ఫుల్ పవర్సు వచ్చెయిరా.

శంక:-మరొక్కటుంది అది చదివేసి పోదాం

శాస్త్రి Excuse me (అని నవ్వును.)

శాస్త్రి:-(విసుగుతో) అదేదోకాని బాబూ వేగం.

విలా:-ఏదీ నన్ను చూడనీ నేనుచదువుతాను

శంక:-చూడరా ఇది (అని యిచ్చును.)

స శే షం.

# క మ ల.

డాక్టర్. యర్రింశెట్టి సత్యనారాయణమూర్తి.

ఆమె చక్కనిచుక్క. ఆపద్మపత్రాలవంటి నేత్రాలు—తుమ్మెద రెక్కల్లాంటి శిరోజాలు. ఆమె అపూర్వసౌందర్యాన్ని చాటుతున్నై. ఆమె ముఖారవిందం నిర్మలంగా సహజహేమచ్ఛాయ లీనుతూవుంది. ఫేస్ పౌడరు, క్రీం పూతలేమీ లేక పోవడంచేత ఆమె కోలముఖంలో, తమలపాకులకంటే కూడా మృదులంగా వున్నట్టున్నాయీ నున్నటిచెక్కిళ్ళు. ఆమె కనుబొమలు కొట్టొచ్చినట్టు కనబడుతుంటాయి. నున్నటి విశాలమైన ఫాలాన్ని తుమ్మెదరెక్కల్లాంటి ముంగురులు ముద్దెట్టుకుంటున్నట్టున్నై. ఆమె కంఠస్వరంలో మాధుర్యం పుట్టిపడుతోంటుంది. ఆమెకు యుక్తవయసువచ్చే కొద్దీ తేజః పూర్ణమైన ఆమె సౌందర్యకాంతిపుంజాలు చాలామంది విద్యార్థుల్ని ఆకర్షిస్తున్నాయి. కాని ఆమె సుకుమారజీవితం సంఘసంస్కార దంష్ట్రల్లోపడి విషాదాంతమైయింది.

రాఘవరావు పూర్వాచారపరాయణుడు ఉభయభాషాప్రవీణ కాకపోయినా పంచకావ్యాలక్షుణ్ణంగా చదివి మంచిజ్ఞానం సంపాదించేడు. కనుకనే ఆపంకిత కేసరి దగ్గరకే కవిమృషభులు సమీపించరు. ఆయనకు కమల ఒక్కర్తేసంతానం తల్లిదండ్రుల కామెయెంతో ముద్దు. కమలకు అయిదేండ్లవయసులోనే వివాహమయింది. తొమ్మిదవయేడు ప్రవేశించేసరికి ఆమె దురదృష్టవశాత్తు భర్తపరలోకగతుడయ్యేడు. పాపం! ఆమెకు ఎప్పుడు పరిణయమయిందో, ఎప్పుడు వైధవ్యం సంభవించిందో సరీగా తెలీనేతెలీదు. అన్ని సౌఖ్యాలు అగ్గలంగా అనుభవించాల్సిన రోజుల్లో ఆమెకు దుర్భరమనోవేదన ఎక్కువైయింది. కమల భవిష్యత్తును గూర్చి పట్టపగలే కలలుకంటూవుంది. అతి బాల్యవివాహం చేసిన తలిదండ్రుల్ని ఒక్కొక్కమారు దూషించేది. ఆమెకు ఒక్కొక్కప్పుడు రాత్రివేళ పక్కమీద పడుకున్న చాలాసేపటికి గాని నిద్రపట్టేదికాదు. భరించరాని బాధ—తీరలేని కొరత- ఆమెలో ఉద్భవించినై. యీవైధవ్యపు శరీరం యీలోకంలో వృద్ధిపొందడం సుఖలేశమని గ్రి

హించి దాని అంత్యాన్ని అభిలషిస్తోంది కమల.

ఇలా ఉండగా, కమలయింటి ప్రక్కనే సుందరం అనే స్కూలుమేస్టరు క్రొత్తగా వచ్చిదిగేడు. అతని వయసు పాతికసంవత్సరాలుంటాయి. చామనచాయశరీరం-విశాలమైన నుదురు-ఆకర్ణాంతములైన కళ్ళూ, ఎదుటి వాళ్లెటువంటివాళ్ళయినా అరక్షణంలో వశపరచుకోగల దృష్టులూ—యువ్వనపు పోకళ్ళను తెలియపరచే నడకగలిగి మొత్తానికి మనిషి. చాలా నాజూకైనవాడే అని చెప్పొచ్చు. అతనుండే గది కిటికీలోంచి చూస్తే, అవతల కమలపడకగది కనబడుతూంటుంది.

ఒకరోజుసాయంత్రం సుందరం స్కూలునుంచి రాగానే తనగదిలో కూర్చొని ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు అప్రయత్నంగా అతని దృష్టి ఎదుటనున్న కిటికీవైపుకు మళ్ళింది. కిటికీనున్న తెరఓమూలకి వత్తిగించబడి ఉంది. అతడు లోపలనున్న స్త్రీవ్యక్తిని చూసిముగ్ధుడైపోయేడు. మొదట్లో అతడాపిల్లను ఏదో తమషాకే చూసేడు. రెండో రోజుకూడా అలాగే చూసేటప్పటికి, ఆపిల్లని కేవలం అందంకోసం చూడ్డం మానలేక పోయేడు. ఆమె కనపడినప్పుడల్లా ఆ అవయవసౌభాగ్యాన్ని పరీక్షిస్తూ కళ్ళతో ఆమెసౌందర్యాన్నంతటినీ గ్రోల్తూండేవాడు. “పాపం ఆఅమ్మాయికి చిన్నతనంలోనే వైధవ్యందాపురించింది. తల్లిదండ్రులు చాలా అన్యాయం చేశారా అమాయికబాలికను. మంచి అంగసౌష్టవం కలిగి తారుణ్యసముద్రంలో యీదులాడుతూన్న ఆపిల్ల ఎంతకని ఓర్చుకుంటుంది ?......? అని ఏమి చేయుటో అనుకున్నాడు. అతనికి పిచ్చెత్తినట్టయింది. అది తగ్గే ఉపాయం కనబడలేదు. మనశ్శాంతికోసం కాస్సేపు షికారు బయల్దేరాడు.

ఆమర్నాడు ఉదయం సుందరం నిద్రనుంచి లేవగానే కమల గదివైపు చూసేడు. ఆమె యింకా పక్కమీదనే ఉన్నట్టు కనబడింది. ఆమె ముఖమండలంలో విషాదచ్ఛాయలు అలముకొనివున్నై. కన్నులనుండి కవోష్ణబాష్పాలు కాల్వలై ప్రవహిస్తున్నాయి. అప్పుడామె తనలో తాను కుమిలిపోతూ “నామొరాలకించేవాళ్లే లేకపోయిన తర్వాత నాకీ ప్రపంచంతో ఏమి సంబంధం ? నితాంతసంతాప సంతప్తమై సంతతమూ, వేడికన్నీటి ధారల్తో అవనీతలాన్ని ఆర్ద్రీకరిస్తూవుండడంకంటే అసువులు బాసి పోవడమే మేలు......అని తన దుస్థితిని గూర్చి దుఃఖిస్తూ, శోచనాపరంపరలలో మునిగిపోయి తలగడాను తన కన్నీటిధారల్తో తడిపివేస్తూవుంది.

ఆదృశ్యాన్ని చూస్తోన్న సుందరానికి జాలివేసింది. కొంతసేపటికి కమల అప్రయత్నంగా సుందరంవైపు దైన్యభావంతో చూడ్కులు ప్రసరించింది. “బెంగపడకు నేనున్నాగా ? ఈతనువు లశాశ్వతములు. కనుకనే అన్ని సౌఖ్యాలు అనుభవించి తీరాలి. మన భారతనారీమణుల్లో ఎంతమంది ఆదర్శికులుగాలేరు ?......” అన్నట్టుగా సుందరం తన చూపుల్లో ప్రేమను ప్రకటిస్తూన్నాడు. కమల ముఖకమలం ఒక్కమారుగా వికసించింది. ఆమె యింకా వలపుతీపి నెఱుగని అమాయికబాలిక ! ఆసమయంలో ఆమెకు తెలీకుండానే ఒక విద్యుత్ప్రవాహం ఆమెలో ప్రవేశించింది. అది క్రమంగా నరనరానికీ ప్రాకిపోయింది. గంభీరంగా నొక్కనిశ్వాసం వొదిలింది. తానట్లా ప్రవర్తించడం తప్పేమో అని ఒక్కమాటు అంతరాత్మనడిగి చూసింది. తప్పయితే తనగుండెలు దడదడా కొట్టుకోవూ ? అలాకొట్టుకోలేదు. కనుక తాను చేస్తున్నపని తప్పుకాద

471

నుకుంది. సుందరం ఆమె సలాపరిక్తిస్తూ ఒక్కచిరునవ్వు నవ్వేడు. కమలకూడా ముద్దులొలికే నవ్వు నవ్వింది. సమయం కనిపెట్టి కమలాసుందరులిరువురుమీద అనంగుడు పుష్పబాణాలు విసిరేడు. ఆరెండు హృదయాల్తోపాటు శరీరాలు కూడా ఏకమయ్యేయి. అదిమొదలు కమలాసుందరులు సర్వసౌఖ్యాలు అనుభవిస్తూ, మన్మథక్రీడల్లో తేల్తూ మేఘాలమీద ఆడిపోతున్నారు. పరస్త్రీని-అందులోనూ, బాలవితంతువును అవినీతికరంగా వాంఛించి ఆమెబ్రతుకు పాడుచేస్తున్నాననే యోచనే లేకపోయింది సుందరానికి. ప్రియుణ్ణి చూసుకుంటూ తనభర్తృవియోగాన్ని మరచిపోయింది కమల!


కాలచక్రం దానియిష్టానుసారంగా అది తిరుగుతూనే వుంటుంది మనమెలాగున్నా. కళ్లుమూసుకున్నట్టే ఏడాది గిర్రునతిరిగింది. కమలకు నెలలుతప్పి గర్భం నిలిచింది. యిన్నాళ్ళు స్వర్గతుల్యమనిపించిన ప్రేమ మెల్లమెల్లగా సళ్ళడం మొదలుపెట్టింది. గర్భందాల్చిన కమల యీరహస్యాన్ని ఎన్నాళ్ళని గోప్యంగా ఉంచుతుంది? ఆమెకుగత్యంతరం ఏమీ లేకపోయింది. ఒకనిశీథసమయంలో సుందరాన్ని కలుసుకోడానికి బయల్దేరింది. పూర్వపు మార్దవమందహాస భావాలు ఆమెలో లేవు. నిసితతీక్షణ దృక్కులు ఆరాజీవాక్షుల నుండి రౌద్రభావంతో వెలువడుతున్నాయి. ఆమె హృదయంలో ఆవేదన కలుగజేస్తున్న నాలుగుముక్కలూ అతిఆవేశంతో యిల్లావెలిబుచ్చింది.

కమల:—మీరిల్లా అన్యాయం చేయడం ధర్మంగా లేదు. నన్ను మొదట్లో పెళ్ళిచేసుకుంటానని నమ్మించి, ఎన్నిసార్లడిగినా నామాటకు సరియైన సమాధానమే లేదుకదా. నేనిప్పుడు వట్టిమనిషినిగాను. యీదీనావస్థలోనున్న నాకు యిప్పటికైనా నా ఏదోఒకటి నిష్కర్షగా చెప్పండి.

సుందరం:-కమలా! నాఅపరాధం మన్నించు. నాకిదివరకే పెళ్ళయింది. ఆపిల్ల నేడో రేపో కాపురానికి రాడానికి సిద్ధంగా వుంది. అందుచేత

కమల:-ఛా! నన్నెంత మోసంచేశావు. ఇహపరాలు రెండింటికి చెడదీసేవు. అజ్ఞానంచేత నిన్ను నమ్మి నీప్రణయపాశం లోపడి నేను చెడిపోయెను. యిక నలుగురిలో తలెత్తుకొని తిరగడం దుర్లభం......

అని అంటూ ఉద్రేకపూరితమైన మనసుతో విస విస నడచిపోయింది. తానుచేసిన అధర్మకార్యానికి సిగ్గుపడి సుందరం దించినముఖం ఎత్తకుండా చైతన్యరహితుడై చలువరాతి బొమ్మయి పోయినాడు.



ఇక ఆమె కీలోకంలో శరణ్యమేం? సుందరం వెనుక ముందు లాలోచించకుండా, వెనుకటి ప్రేమాప్రణాహాప్రేమే యతనువీసమైనా తలచకుండా కమలను తిరస్కరించేడు. ఆమెగతి యిప్పుడు వెనుకనూయి, ముందుగొయ్యివలె వుంది. ముమ్ముందు లోకాపవాదులలోనై తలెత్తితిరగడమనేది ఆమెకు దుర్ఘటమైన సమస్య. అది తప్పించుకొనుటకు వేరుమార్గమేదీ కనబడలేదు. వెంటనే కాగితమొకటితీసి తన దుస్థితిగూర్చి తండ్రికో లేఖవ్రాసింది. ఆగాఢాంధకారసమయంలో మృత్యుదేవిని కౌగలించుకోడానికి బయలుదేరింది. తిన్నగా వెళ్ళివెళ్ళి ఒకనూతి చెంతకు చేసుకుంది. కొంతసేపటికి "ధన్"మని నూతిలో శబ్దం! ఆశబ్దానికి చెట్లపైనున్న పక్షిసముదాయం ఒక్కపెట్టున రొదచేసింది. కమల ఆత్మచిలుక యీనీచప్రపంచాన్ని విడిచి యెగిరిపోయింది. ఇక మెవరేమనుకుంటేనేం? ఆమె విషాదచరిత్ర అంతటితో అంతరించింది.

భళ్లున తెల్లవారింది. ప్రభాతభానుడు తన ప్రబుద్ధ సువర్ణారుణకిరణాల్తో నిద్రపోతూన్నవాళ్ళని మేల్కొల్పుతున్నాడు. పక్షులుకూస్తూ తమతమ పనులమీద పోతున్నాయి. రాఘవరావుగారి గృహిణి యథాప్రకారంగా పనులు చేసుకోడానికి లేచి, కమలను లేపడానికి ఆమెగదిలోనికి వెళ్లింది. కమల కనబడలేదు. మంచంమీద ఒకకాగితం మాత్రం పడివుంది. విశాదపూరితమైన హృదయంతో ఆకాగితాన్ని రాఘవయ్యగారి చేతికిచ్చింది. ఆతృతతోవిప్పి యిలా చదవడం ప్రారంభించేరు.

" నాన్నా,

మంచిచెడ్డ లాలోచించకుండా తుచ్ఛధనానికి ఆశించి నాకు చిన్నతనంలోనే పెళ్ళీచేసేరు. ఎంత తెలివితక్కువపని చేసారో ఆలోచించుకోండి, దానికి ప్రతిఫలం యీరీతిగా పరిణమించింది. అందుకనే సంఘ సంస్కరణాభిలాషు లెందరో. ఎన్నాళ్ళనుండో వేళ్ళుపాతుకొని వున్న యీబాల్యవివాహ దురాచారాన్ని రూపుమాపి, బాలవితంతువుల దుఃఖజ్వాలలు ఆర్పడానికే రజస్వలానంతర వివాహాలు ప్రోత్సాహిస్తోన్నారు. కాని అలాచేస్తూన్నప్పటికీ యింకాకొంతమంది సనాతనాయులు అజ్ఞానమనే అంధకారంలోపడి, యానాం, ఫ్రెంచిపేట, పరిటాల వగైరాలకు పారిపోయి, దొంగవివాహాలు చేస్తూనేవున్నారు. ఆంధ్రసోదరీమణుల్లో ఎంతమంది బాలవితంతులు, నిండుయవ్వనంలోఉన్న యిరుగుపొరుగు అమ్మలక్కలు తమభర్తలతో దాంపత్యసుఖా లనుభవిస్తోండడం చూసి, విలపిస్తున్నారో తెలుసునా? చిన్నతనంలో ఎవ్వడో వివాహమై, భర్తముఖమెల్లాంటిదో దాంపత్యధర్మ మెట్టిదో తెలియని బాల్యావస్థలో తల్లిదండ్రులు స్వసంతుష్టికొరకై వివాహం గావించిన బాలికలకు భర్తలు మరణించినంత మాత్రాన్న వారి యావజ్జీవనం వైధవ్య దుఃఖాబ్ధిలో మునుగుతూండ వలసిందేనా? అట్టి బాలవితంతువులు మళ్ళా ఎందుకు పెళ్ళిచేసుకోకూడదు? భగవంతుడు కూడా నాకు యీవిషయంలో కొంతపక్షపాతం కనబరచేడు. నేనిప్పుడు వట్టి మనిషినికాను. నెలలు తప్పినై. ఎన్నాళ్ళని యీ రహస్యాన్ని గోప్యంగా ఉంచగలను? లోకులు కాకులన్నారు. యిక యీప్రపంచంలో వుంటే లోకమంతా నామీద విరుచుకుపడి నిందలు మోపుతారనే భయంచేత ఆత్మహత్యకు సాహసించేను. అమ్మా మీరుమళ్ళా నన్ను ఎంతో ముద్దుగా కమలా!' అని పిలవలేరుకదూ? పిలిచినా మరినేను మీతో మాటాడలేనుకదూ? నాన్నా, మీకుచాలా శ్రమయిచ్చినందుకు క్షమించి నన్నికమరిచిపొండి. అమ్మకు నాకడసారి వందనములని చెప్పండి...... ఇట్లు,

మీముద్దుబిడ్డ కమల "

473